

'పని సర్దుబాటు'ను బహిష్కరించిన ఫ్యాప్టో

ప్రజాశక్తి - పిచ్చాటూరు

తిరుపతిలో..

ఉపాధ్యాయుల పని సర్దుబాటు చాలా అసంబద్ధతతో కూడుకుందని ఉపాధ్యాయ సంఘాలు చెప్పినా పెడచెవిన పెట్టడాన్ని నిరసిస్తూ ఉపాధ్యాయులు ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పిచ్చాటూరు మండలంలో విద్యాశాఖ భవనంలో సోమవారం జరగాల్సిన ఈ కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని బహిష్కరిస్తూ, ఎంఇఒ 2 యుగంధర్‌రాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు నరేష్‌కుమార్, మునిరత్నం, బాలాజీ, డిటి సుందరం, మదన్ ముషాయెర్, ప్రకాష్, సుందర్‌కుమార్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి ముసుగులో కబ్జాల పర్వం : సిపిఎం

కబ్జాకు గురవుతున్న స్థలం ఇదే..

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

భక్తి ముసుగులో విలువైన భూమిని కాజేయాలని, మూడు గ్రామాలకు అవసరాలను తీర్చే గుంట పరంబోకు స్థలంలో అక్రమంగా శక్తి పీఠాన్ని ఏర్పాటు చేసి, అడ్డుకున్న వారిపై క్షుద్ర పూజలు ప్రయోగిస్తానంటూ బెదిరింపులు దిగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. గ్రామస్తుల అవసరాలు తీర్చే భూమి కబ్జాకాకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. వందవాసి నాగరాజు మాట్లాడుతూ తిరుపతి జిల్లా తడ మండలం, కొండూరు రెవెన్యూ గ్రామ లెక్క దాఖల సర్వేనెంబర్ 148 లోని 6 ఎకరాల 65 సెంట్లు గుంట పరంబోకు భూమి ఉందని, జాతీయ రహదారికి పక్కనే ఉండడంతో భక్తి ముసుగులో ఈ భూమిని కాజేయాలని కొండూరు, సుందరాపురం, సత్యనారాయణపురం చెందిన మూడు గ్రామాలకు చెందిన వ్యక్తి కబ్జాకు పాల్పడుతున్నారని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. ఈ గుంట పరంబోకు భూమిలో ఈ మూడు గ్రామాలకు చెందిన ప్రజలు గ్రామ దేవతలకు చిన్నపాటి ఆలయాన్ని నిర్మించుకుని పూజలు చేసుకుంటూ పొంగళ్ళు పెట్టి జాతర కార్యక్రమాలకు సదరు స్థలాన్ని ఉపయోగించుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధంగా భూకబ్జాలు ప్రస్తుతం ఏర్పడ్డ నూతన కూటమి ప్రభుత్వంలో అయినా అరికట్టాలన్నారు. అధికారులు స్పందించి మూడు గ్రామాలకు ఉపయోగంగా ఉన్న గుంట పోరంబోకు స్థలాన్ని కాపాడాలని, లేనిపక్షంలో గ్రామస్తుల పక్షాన సిపిఎంప్రత్యక్ష పోరాటాలకు దిగి ఆ భూమిని వారికి అప్పగించే పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. ఎప్పుడో ప్రభుత్వం నిషేధించిన అశాస్త్రీయమైన క్షుద్ర పూజలను ప్రయోగిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకర అల్లెయ్య, బి. పద్మనాభయ్య, కె.సాంబశివయ్య, ఎస్ కె.రియాజ్, కె.లక్ష్మయ్య, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో వి.నాగరాజు

భూ సమస్యల పరిష్కారానికి...

16 నుంచి రెవెన్యూ సదస్సులు

వకుళమాత సేవలో రెవెన్యూ, విద్యుత్ శాఖ మంత్రులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రైతుల భూ సమస్యల పరిష్కార దిశగా ప్రజల ముంగిటకు గ్రామాలకు అధికారులు వెళ్లి పరిష్కరించే విధంగా ఈ నెల 16 నుండి సెప్టెంబర్ 30 వరకు సదస్సులను రెవెన్యూ శాఖ చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. ఆగస్ట్ నెల 15 న ఫార్మల్ లాంచింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. సోమవారం ఉదయం స్థానిక పేరూరు లోని వకుళమాత ను రెవెన్యూ శాఖామంత్రితో పాటు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దర్శించుకున్నారు. అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి మీడియాతో మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి, వకుళమాత అమ్మవారి కప రాష్ట్రం పై ఎపుడూ ఉండాలని కోరుకున్నానని అన్నారు. అన్ని రంగాలలో గత ప్రభుత్వంలో వెనుకబడిన రాష్ట్రాన్ని అభివద్ధి వైపు తీసుకువెళ్ళాలని రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని గెలిపించారని, ఆ దిశగా ఒక ప్రణాళిక బద్ధంగా రాష్ట్రాన్ని అభివద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా రైతుల భూ సమస్యల పరిష్కార దిశగా, ప్రజల ముంగిటకు గ్రామాలకు రెవెన్యూ సంబంధిత అధికారులు వెళ్లి పరిష్కరించే విధంగా, ఈ నెల 15న ఫార్మల్ లాంచింగ్ చేసి, 16 నుండి సెప్టెంబర్ 30 వరకు కార్యాచరణ ప్రణాళికతో కార్యక్రమాలు రెవెన్యూ శాఖ నుండి చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో రియల్ టైమ్ గవర్నెన్స్ ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, తమ ప్రభుత్వంలో రియల్ టైమ్ గవర్నెన్స్ , కాల్ సెంటర్లు అందుబాటు లోకి తీసుకు వచ్చే విధంగా కొత్త కార్యాచరణ చేయనున్నామని తెలిపారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ లను తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆరణి శివకుమార్ మంత్రులకు శాలువలు కప్పి పుష్ప గుచ్చాలు ఇచ్చి సత్కరించారు. తిరుపతి అభివద్ధికి సహకరించాలని కోరారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం మంత్రులకు తిరుమలలో దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే తిరుపతి పరిసర ప్రాంతాల్లో గత వైసిపి హయాంలో జరిగిన భూ అక్రమాలను వివరించారు. మంత్రి స్పందిస్తూ భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అధికారులతో 'హర్ ఘర్ తిరంగా' ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆజాదీ కా అమత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా సచివాలయంలో ఘనంగా నిర్వహిస్తూ జిల్లా అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ సంబంధిత అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించి అధికారులు అందరూ కలిసి జాతీయ జెండాలు చేత బూని దేశ భక్తి ప్రతిజ్ఞ చేశారు. కాన్వాస్‌పై అధికారులు సంతకాలు చేశారు. ప్రాంతీయ సంచాలకులు టూరిజం రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య పాల్గొన్నారు.

జూ పార్కులో ప్రపంచ ఏనుగుల దినోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాల (ఎస్వీ జూపార్కు)లో సోమవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ సి. సెల్వం ఏనుగుల దినోత్సవం సందర్భంగా జూ పార్కుకు వచ్చిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవుల్లో ఏనుగుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లను ఏనుగులకు తినిపించారు. జూ పార్కు అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రామచంద్రనాయక్‌కు నామినేటెడ్ పదవివ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

జనసేన పార్టీకి నిరంతర సేవలు అందించడంతోపాటు అనేక సామాజిక కార్యక్రమాలతో సమాజ హితం కోసం కషి చేస్తున్న జనసేన ఎన్ఆర్ఐ కువైట్ అధ్యక్షుడు రామచంద్రనాయక్ కు ప్రభుత్వం నామినేటెడ్ పదవి కల్పించాలని భారత యువజన వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ రాథోడ్ డిమాండ్ చేశారు. గతంలో జనసేన పార్టీకి కోటి రూపాయలు విరాళం అందించడంతోపాటు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను 30 రోజులపాటు నిర్వహించి పార్టీ పట్ల తనకున్న విధేయతను చాటుకున్నారన్నారు.

వరలక్ష్మీ వ్రతం కరపత్రాలను ఆవిష్కరించిన ఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 16వ తేదీ జరగనున్న వరలక్ష్మీ వ్రతం కరపత్రాలను సోమవారం టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని ఈవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, తిరుచానూరులోని ఆస్థానమండపంలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వరలక్ష్మీ వ్రతం జరగనుందన్నారు. అదేరోజున సాయంత్రం 6 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడవీధులలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్ పాల్గొన్నారు.

విద్యార్థి యుగేష్ మృతికి ఎంఎల్ఎ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - కెవిబిపురం

తమిళనాడులోని కనకమ్మ సత్రం ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరు గాయపడ్డారు. మృతిచెందినవారిలో కెవిబిపురం మండలంలోని కోవనూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్‌నేత కిరణ్‌యాదవ్ పెద్దకుమారుడు, ఇంజినీరింగ్ విద్యార్థి యుగేష్ యాదవ్ మృతిచెందడం పట్ల ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యుగేష్ తమిళనాడులోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి తిరువణ్ణామలై గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

మొండి బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శ్రీ స్వామి హథీరాంజీ మఠం ఆధ్వర్యంలో ఉన్న షాపుల అద్దెలను సకాలంలో చెల్లించడంలో విఫలమైన వారి నుండి రావలసిన పూర్తిస్థాయి బాకీ అద్దెలను వసూళ్లు చేయాలని కొత్తగా ఇంచార్జి పరిపాలన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కేఎస్. రామారావు అధికారులను ఆదేశించారు. ఇంచార్జి పరిపాలన అధికారి రామారావు సూచనలతో సోమవారం మఠం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మఠం సిబ్బంది, పెన్షనర్లు సైతం మొండి బకాయిల వసూళ్ల ప్రత్యేక డ్రైవ్ లో పాల్గొన్నారు. శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన షాపులను లీజు ద్వారా పొందిన వారు మఠంకు చెల్లించవలసిన అద్దెలను సకాలంలో చెల్లించకపోవడంతో మఠం కార్యకలాపాలు నిర్వహించడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, బకాయి ఉన్న మొత్తాన్ని లీజు దారులు తక్షణమే చెల్లించాలని, చెల్లించని పక్షంలో షాపులను స్వాధీనం చేసుకుంటామని లీజు దారు వద్దకు వెళ్లి హెచ్చరించారు. మఠం సిబ్బంది మధుసూదన్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, గంగాధరం పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం ఇన్‌ఛార్జి ఏఓగా కెఎస్ రామారావు

శ్రీ స్వామి హథీరాంజీ మఠం ఇంచార్జి ఏఓగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈవో కెఎస్ రామారావు ఆదివారం తిరుపతి మఠంలోని పరిపాలన అధికారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు హథీరాంజీ మఠం ఫిట్ పర్సన్ గా కొనసాగిన డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడు ఆయన మాతశాఖకు వెళ్లారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కనకదుర్గమ్మ గుడి ఆలయ ఈవోకు తిరుపతి హథీరాంజీ మఠం ఇంచార్జి ఏఓగా అదనపు బాధ్యతలను కేటాయించింది. ఆదివారం మఠం పరిపాలన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కెఎస్.రామారావుకు మఠం అధికారులు సాదరంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతిటౌన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక లీలామహల్ కూడలి సమీపంలో మస్టర్ పాయింట్ వద్ద ముఖ ఆధారిత హాజరును పరిశీలించారు. అరగంట లోపు ఆలస్యంగా వచ్చినా తప్పకుండా హాజరు నమోదు చేయాలని, అంతకంటే ఎక్కువ సమయం లేటుగా వస్తె గైర్హాజరుగా గుర్తించాలన్నారు. తిమ్మినాయుడు పాలెం సమీపంలో నూతనంగా పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన చేసారు. పాత కమిషనర్ బంగ్లా, పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. ఆజాది కా అమత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం నిర్వహించనున్న ర్యాలీ కొరకు ఎస్వీయూ స్టేడియంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి ఉన్నారు

తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్రవాహనాలకు ఆంక్షలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుమల మొదటి, రెండవ ఘాట్ రోడ్లలో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను నిలిపివేస్తూ టీటీడీ ఫారెస్ట్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 12వ తేదీ నుంచే దీనిని అమలు చేయనున్నారు. ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ వరకు ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మాత్రమే రెండు ఘాట్ రోడ్‌లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను అనుమతించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది.. భక్తుల భద్రత దష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రకారం ఆగస్టు, సెప్టెంబర్ నెలలు వన్యప్రాణుల సంతానోత్పత్తి కాలం ఎక్కువగా ఉంటుంది. దీంతో క్రూర మగాలు మొదటి ఘాట్ రోడ్డులో తరచూ రోడ్లు దాటుతూనే ఉన్నాయి. భక్తులతో పాటు వన్యప్రాణుల ప్రయోజనాల దష్ట్యా మానవ-జంతు సంఘర్షణను నివారించడానికి, సెప్టెంబర్ 30 వరకు ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు మాత్రమే ద్విచక్రవాహనాలను మొదటి రెండవ ఘాట్ రోడ్‌లలో తిప్పడానికి టిటిడి నిర్ణయించింది. భక్తులు ఈ మార్పును గమనించిసహకరించాలని టిటిడి ఫారెస్ట్ అధికారులు కోరారు.

జ్ఞాన్ ధన్ పార్టనర్ మీట్ విజయవంతం

ప్రజాశక్తి -తిరుపతిటౌన్

విదేశాల్లో అభివృద్ధి చెందుతున్న అధ్యయన రంగంపై చర్చించేందుకు పరిశ్రమ పెద్దలు, నిపుణులను ఏకతాటిపైకి తెచ్చిన 'జ్ఞాన్ ధన్' సంస్థ ఇటీవల భాగస్వామ్య సదస్సును ముగించింది. ఈ కార్యక్రమం విదేశీ విద్యా రంగంలో ప్రస్తుత ధోరణులు ,భవిష్యత్తు అంచనాలపై దష్టి సారించి అంతర్దష్టితో కూడిన చర్చలు ,నెట్ వర్కింగ్ అవకాశాలకు వేదికను అందించింది. ఇటీవల సంవత్సరాలలో క్షీణిస్తున్న ధోరణుల యొక్క గణనీయమైన డేటా పాయింట్లను హైలైట్ చేస్తూ భారతీయ అధ్యయన విదేశీ మార్కెట్లో ధోరణుల అవలోకనంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. 'జ్ఞాన్ ధన్ విశ్లేషణ ప్రకారం, విదేశీ విద్యా రుణాలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2024 జనవరి నుండి మార్చి వరకు 30 శాతం తగ్గుదల కనిపించింది. అదేవిధంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు 23 శాతం తగ్గుదల నమోదైంది. విదేశాల్లో చదువుపై ఆసక్తి తగ్గడానికి ప్రస్తుత మాంద్యం కారణమని తన 20 ఏళ్ల సినీ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఇటిఎస్ ఇండియాకు చెందిన జయశ్రీ నటరాజన్ విద్యార్థుల ఎండ్-టు-ఎండ్ ప్రయాణంపై దష్టి పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. భారత స్థాయిలో ఇటిఎస్ దరఖాస్తుదారులలో 5శాతం పెరుగుదలను చూస్తోందని హైలైట్ చేశారు.

ఆర్.కె.అబాకస్ విద్యార్థికి అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

బైరాగిపట్టెడలోని ఆర్.కె.అబాకస్ శిక్షణ కేంద్రంలో ఆన్‌లైన్ మాద్యమం ద్వారా శిక్షణ పూర్తి చేసిన ఏపికి చెందిన ఎన్ఆర్ఐ విద్యార్థి (నెదర్లాండ్స్) కాలసముద్రం దర్శిల్ అంతర్జాతీయ స్థాయిలో అబాకస్ పోటీల్లో ప్రథమ అవార్డు పొందారని ఆర్.కె.అబాకస్ ఛైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా గత 10 సంవత్సరాలుగా వేలాది మందికి శిక్షణ ఇస్తూ, వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి విజ్‌కిడ్ ఎడ్యుకేషన్ చెన్నై వారి ఆధ్వర్యంలో ప్రతి ఏటా జాతీయ, అంతర్జాతీయ పోటీలు నిర్వహించి, అవార్డులు ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.కె.అబాకస్ డైరెక్టర్, వీక్ష స్కూల్ హెడ్‌మాస్టర్ ఆర్.కె.విమల, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి రమాదేవి పాల్గొన్నారు.

రేపు షార్‌లో పవన్‌కల్యాణ్ పర్యటన

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం షార్‌లో మంగళవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటించనున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 9 గంటలకు ఆయన షార్‌సెంటర్‌కు చేరుకుంటారు. నక్షత్ర గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. అనంతరం కురుప్ ఆడిటోరియంలో జరిగే స్పేస్‌డే కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం షార్‌లోని రాకెట్ ప్రయోగ వేదికను సందర్శిస్తారు. అనంతరం తిరిగి హెలికాప్టర్లో రేణిగుంటకు వచ్చి తిరుగు ప్రయాణం అవుతారు. ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్లను ఇస్రో నిర్వహిస్తోంది.

ఎస్వీ జేఎన్ఎం మున్సిపల్ స్కూల్లో ఎగ్జిబిషన్ వద్దు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఎస్వి జేఎన్ఎం మున్సిపల్ హైస్కూల్లో క్రీడల కోసం ఆదరించాల్సిన గ్రౌండ్ ప్రైవేట్ ఎగ్జిబిషన్ నిర్వహించడం మంచిది కాదని మాజీ డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ భక్తవత్సలం కమిషనర్ ఎన్ మౌర్యకు వినతిపత్రం ఇచ్చారు. గ్రౌండ్ లేకపోతే విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందని, ప్రైవేట్ ఎగ్జిబిషన్‌కు అనుమతులు ఇవ్వొద్దని సూచించారు. గతంలో ఇలా అనుమతులు ఇవ్వడం వల్ల విద్యార్థులకు క్రీడలు దూరమైపోతున్నాయని అన్నారు. కమిషనర్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

తిరుపతి సిటి : పాడి పరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్న రైతులను నట్టేట ముంచేలా పాలకులు వ్యవహరిస్తున్నారని, పాలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు పాటూరి వెంకటరత్నం అన్నారు. తిరుపతి కలెక్టరేట్ ఎదుట ఉమ్మడి జిల్లాల పాల రైతులు పాల్గొని, అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తలకోన జల సాధన సమితి నాయకులు మారెళ్ళ శ్రీనివాసులు, కే కుమార్ రెడ్డి, ఐఎఫ్టియు నాయకులు రుద్ర గోపి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సిబ్బంది నిరసన

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆల్ ఇండియన్ రైల్వే మెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సంయుక్త పిలుపు లో భాగంగా నిరసన కార్యక్రమం తిరుపతి జనరల్ , టెక్నికల్ బ్రాంచ్ ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సబ్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిజన్ అధ్యక్షులు సుదర్శన్ రాజు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కార్మికులకు కోవిడ్ సమయంలో ఫ్రీజ్ చేసిన 18 నెలల డిఏ అరియర్స్ ను వెంటనే చెల్లించాలని, 8వ పే కమిషన్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, పాయింట్స్ మెన్ లకు 4 గ్రేడ్స్ ప్రమోషన్ ఛానల్ కల్పించాలని, రెస్ట్ రూం ల సౌకర్యం కల్పించాలి, కార్మికులకు అందరికీ 8 గంటల పని విధానం కల్పించాలని, రైల్వేలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ వద్ద అన్నా క్యాంటీన్ ప్రారంభించాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల వద్దకు వచ్చే అర్జీదారులకు అనుకూలంగా ఉండేలా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత, సిఐటియు నాయకురాలు ఆర్.లక్ష్మి సంయుక్తంగా డిఆర్ఒకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం గ్రీవెన్స్‌డే పురస్కరించుకుని వందలాదిమంది పేదలు కార్యాలయాలవద్దకు తరలి వస్తారని, వారికి అనుకూలంగా అన్నా క్యాంటీన్లను ప్రారంభిస్తే వారి ఆకలి తీర్చినవారవుతారన్నారు. కలెక్టరేట్ పరిసరాల్లో తినడానికి ఏమీ లేక పస్తులతోనే ఉండే పరిస్థితి ఉందన్నారు. కలెక్టరేట్ క్యాంటీన్లో తొలుత రూ.30కే భోజనం పెట్టేవారని, ప్రస్తుతం 70కి పెంచేశారన్నారు.

నిత్యం కార్పొరేటర్ల ఫిర్యాదులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ప్రజా సమస్యలపై కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వడం ఆనవాయితీగా మారింది. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు శాలిని, ఉమా అజయ్ లు కమిషనర్ ను కలసి తమ వార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజల నుండి వినతులను స్వీకరించిన కమిషనర్ ప్రజల నుండి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బీసీ హాస్టల్లో విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట బీసీ హాస్టల్లో సోమవారం ఉదయం 8 గంటలకు విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వేమన విజ్ఞాన కేంద్రం నాయకులు ఒ.వెంకటరమణ విషయం తెలుసుకుని 15 మందిని రేణిగుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హాస్టల్ విద్యార్థులను పరామర్శించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రేణిగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి పైకెక్కి రోడ్డుపై విద్యార్థులతో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్ మాట్లాడుతూ రేణిగుంట బీసీ హాస్టల్ విద్యార్థులకు వాంతులు, విరేచనాలై అస్వస్థతకు గురైనా హాస్టల్ వార్డెన్ విషయం బయటకు పొక్కకుండా వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. విద్యార్థుల ఆరోగ్యం విషమిస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే రెండు మూడు రోజులుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాదాపు 20 మంది విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. హాస్టల్లో కనీస వసతులు లేవని, లైట్లు, ఫ్యాన్లు వెలగడం లేదు, తిరగడం లేదని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని అనేకమార్లు విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. వారంలో ఒక్కసారైనా జిల్లా అధికారులు విజిట్ చేసే పరిస్థితి లేదన్నారు. బీసీ హాస్టల్లో వసతులు మెరుగుపరచని పక్షంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల, సిపిఎం నాయకులు హరినాథ్, సెల్వరాజ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ధర్నా, ఆస్పత్రిలో సేవలు

రేణిగుంటలో విద్యార్థుల నిరసన

రుయాలో విద్యార్థులకు సేవలు

అస్వస్థతకు గురైన విద్యార్థులను రుయా ఆస్పత్రిలో చేర్చి, చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, అక్కడే రెండు గంటల పాటు వారికి సేవలను అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అక్బర్, రవి మాట్లాడుతూ జూన్ నుంచి వరుసగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై వెల్ఫేర్ అధికారులకు, కలెక్టర్‌కు వినతులు ఇచ్చినా పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చూపారని మండిపడ్డారు. వార్డెన్ పోస్టులను భర్తీ చేయడం లేదని, తిరుపతిలో ఓ హాస్టల్, రేణిగుంటలో ఓ హాస్టల్‌ను ఏ విధంగా చూసుకోగలరని ప్రశ్నించారు. ఆదివారం బయట ఫుడ్ తీసుకుని, హాస్టల్ ఫుడ్ కలిపి తినడం వల్ల 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అన్నారు. ఇకనైనా జిల్లా యంత్రాంగం స్పందించి పేద బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్యార్థులను పరామర్శించిన వారిలో నరేంద్ర, వినోద్, బాల ఉన్నారు.

బాలికల చదువు.. దేశానికి వెలుగు..

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: బాలికల చదువు దేశానికి వెలుగు అని పలువురు ప్రముఖులు పేర్కొన్నా రు. ఏర్పేడు మండలంలోని పల్లం హైస్కూలు, పాపానాయుడు పేట హైస్కూలు, ఇంటర్ కళాశాలలో క్రై సంస్థ పిలుపు మేరకు ప్రగతి సంస్థ పిల్లలతో డ్రాయింగ్ కాంపిటీషన్, బాలికల చదువు ప్రాముఖ్యత' అనే అంశంపై వంద మంది పిల్లలతో డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. పిల్లలు రకరకాల అంశాలపై డ్రాయింగ్ వేయగా 40 మందిని ఎంపిక చేశారు. ఈ పోటీలో కళాశాల ప్రిన్సిపల్, స్కూల్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ప్రగతి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరిత గతిన పరిష్కరిస్తామన్నారు. అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయా లన్నారు. అనంతరం పలువురు వినతి పత్రాలు అందచేశారు. అనంతరం ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపల్ లు కలిసి టీచర్స్ డే రోజు న అతిథిగా తమ పాఠశాలకు రావాలని కోరారు.

ఎస్‌విఎంసిలో జాతీయ అత్యవసర ప్రాణ రక్షణ నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి ఎస్‌వి వైద్య కళాశాలలో జాతీయ అత్యవసర ప్రాణ రక్షణ నైపుణ్యాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని వైద్య కళాశాలల నుండి ఎంపిక చేసిన వైద్యాధికారులు, నర్సింగ్ సిబ్బంది కి మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ తరహా శిబిరం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో తొలి సారి జరుగుతున్నట్టు ప్రాణ రక్షణ నైపుణ్యాభివృద్ధి నోడల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి రవి ప్రభు, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, నెల్స్ జాతీయ సమన్వయకర్త అనుభూతి ఆండ్రూస్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: కౌన్సిలర్

ప్రజాశక్తి - వెంకటగిరి: వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని 14 వ వార్డు కౌన్సిలర్ ఆది శంకరయ్య తెలిపారు. సోమవారం వెంకటగిరి మునిసిపాలిటీ పరిధి లోని సుదర్శన్ నగర్ సచివాలయంలో ప్రజా సమస్యల పైన జరిగిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి వినతులను కౌన్సిలర్ శంకరయ్య అర్జీలు స్వీకరించారు. ప్రజాసమస్యలను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారన్నారు.

ఎంపిడివో బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఎంపీడీవోగా సాయి లహరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ ఎన్నికల్లో బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ గా త్రివిక్రమరావు విధులు నిర్వహించారు. ప్రస్తుతం సాయిలహరి బుచ్చినాయుడు మండల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వరదయ్యపాలెం ఎంపీడీవో ప్రసాద్ ఇన్చార్జి ఎంపీడీవో త్రివిక్రమ రావు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సత్య ఏజెన్సీస్ షోరూమ్ ప్రారంభం

సత్య ఏజెన్సీస్ షోరూంను ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : చెన్నైకి చెందిన ప్రముఖ సత్య ఏజెన్సీస్ వారి 28 వ షో రూమ్ ను పుత్తూరులో బిల్డింగ్ యజమాని ద్వారకా నాథ్ చెట్టి, సుభాషిణి హస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ శ్రీధర్ రాజు, డాక్టర్ సుభాషిణి లు సోమవారం రిబ్బన్ కట్ చేసి షోరూమ్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ రాజు మాట్లాడుతూ పుత్తూరు పట్టణం ప్రజలకు అతి తక్కువ ధరలతో నాణ్యమైన వస్తువులతో సత్య ఏజెన్సీని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు చెన్నై ప్రాంతాల్లో ఇలాంటి షోరూమ్ ఉన్నాయని అలాంటివి పుత్తూరులోనూ ప్రారంభించడం ఎంతో శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు ఆంధ్రప్రదేశ్ సత్య ఏజెన్సీ హెడ్ సెంథిల్ , నాగేంద్ర ప్రముఖులు వివిధ కంపెనీల సిబ్బంది పాల్గొన్నారు.

పని సర్దుబాటు కౌన్సెలింగ్ మాకొద్దు : ఫ్యాప్టో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పని సర్దుబాటు కౌన్సెలింగ్‌కు తామంతా వ్యతిరేకమని తొట్టంబేడు మండల ఫ్యాప్టో నాయకులు స్పష్టం చేశారు. ఉపాధ్యాయ సమస్యలను పరిగణలోకి తీసుకోకుండా పని సర్దుబాటు కౌన్సెలింగ్‌కు రాష్ట్ర విద్యాశాఖ ముందుకెళ్లడంపై తొట్టంబేడు ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సోమవారం ఫ్యాప్టో నాయకులు నిరసన తెలిపారు. అనంతరం ఎంఈఓ భారతికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఓ విజయ కుమార్, వై విజయశ్రీ, పి హేమలత, ఎస్‌టియు నుండి టి కృష్ణయ్య, కె చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఐ విజయ కుమారి, బి శారద, మహ లక్ష్మమ్మ, ధనమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, మార్టిన్, లావణ్య, రాణి పాల్గొన్నారు.

రేణిగుంట గంగ జాతరకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట గంగ జాతరకు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలో గంగమ్మ జాతరను పురస్కరించుకుని రేణిగుంటను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ జాతర సందర్భంగా రేణిగుంట పట్టణానికి ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

దళితులను చీల్చేందుకే వర్గీకరణ నాటకం : పులి శ్రీకాంత్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దళితులను రెండుగా చీల్చి రాజకీయ లబ్ది పొందుందుకే ఎస్సీ వర్గీకరణ నాటకాన్ని ప్రస్తుత రాజకీయ పార్టీలు తెరపైకి తెచ్చాయని దళిత నాయకులు పులి శ్రీకాంత్ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక అంబేద్కర్ భవన్లో మాల నేతలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్సీలను పూర్తిగా అణగదొక్కేందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపడుతున్నాయన్నారు.

పొంతనలేని సమాధానాలు వద్దు..

- ఉచిత ఇసుక అందుబాటులోకి తేవాలి
- తహశీల్దారుకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డివిజన్ పరిధిలో ఉచిత ఇసుక విషయంలో అధికారుల పొంతనలేని సమాధానాలు చెప్పడం తగదని, వెంటనే వినియోగదారులకు ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని మండల తహశీల్దారు చంద్రశేఖర్‌కు గ్రీవెన్స్‌డే సందర్భంగా సిపిఎం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రతి గ్రీవెన్స్‌డేలో వినియోగదారులు ఉచిత ఇసుక కోసం అర్జీలు ఇచ్చి అధికారులు చుట్టూ తిరుగుతున్నా పొంతన లేని సమాధానాలు ఇస్తుండడంతో ప్రజలు ఇసుక కోసం నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గూడూరులోని పలు సమస్యలపై తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రజలు నూతన గృహ నిర్మించుకునేందుకు ఉచిత ఇసుక లభించడం లేదని తెలిపారు. తహశీల్దారు వెంటనే స్పందిస్తూ ఇసుక ఎక్కడి నుంచైనా ఉచితంగా తీసుకు వెళ్లవచ్చని ఎవరైనా ఆపితే తమ నెంబరుకు ఫోన్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఉచిత ఇసుకపై సరైన సమాధానం ఇవ్వ లేదని గూడూరు డివిజన్ భవన నిర్మాణ సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో

తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఈనెల 5వ తేదీ 500 మంది భవన నిర్మాణ కార్మిక రంగ కార్మికులు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. అదే రోజు ఆర్‌డివో కూడా ఇసుక అందుబాటులో వుందని భరోసా ఇచ్చారని, ఇసుక కోసం ట్రాక్టరు తీసుకెళితే అడ్డు కుంటున్నారని, రోడ్డుపైకి వస్తే పోలీసులు అడ్డుకుంటున్నారని తెలిపారు. వెంటనే అధికారులు దీనిపై చర్యలు తీసుకుని ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గూడూరు శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, బి.వి రమణయ్య, ఎస్ సురేష్, భవన నిర్మాణ సంఘం వ్యవ స్థాపకులు పుట్టా శంకరయ్య, బండి కిష్టయ్య, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌పికి 80 ఫిర్యాదులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎస్‌పి సుబ్బరాయుడుకు జిల్లా వ్యాప్తంగా వచ్చిన పలువురు బాధితులు 80 సమస్యలపై ఫిర్యాదులు అందించారు. వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు అందించి సకాలంలో విచారించి చట్టపర చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలపై చర్యలు తీసుకుంటామని ఎస్‌పి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాల యాలలో ఫిర్యాదు చేయవచ్చునని ఆ ఫిర్యాదులనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు వెంకట్రావు, విమల కుమారి, డీఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి సుబ్బరాయుడు

భూ బకాసురులపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలో భూ బకాసురుల తీరు తారా స్థాయికి చేరుకుందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐకి సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని వికృతమాల రెవెన్యూ పరిధి లోని మర్రిమందలో ఇందిరమ్మ పట్టాలు ఇచ్చిన స్థలంలో భవిష్యత్తు అవసరాల కోసం ఉంచిన స్థలం సర్వే నెంబర్ 132,133 లలో ఎకరా భూమిని కొంత మంది వైసీపీ నాయకులు ఆక్రమించడంతో ఏర్పేడు మండల సిపిఎం నాయకులు చొరవ తీసుకొని అప్పటి తహశీల్దారు ఉదయ భాస్కర్ రాజుకి వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన ఆక్రమణ స్థలంలో రెవెన్యూ సిబ్బందిని పంపి ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డును జులై 10వ తేదీన ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే భూమిని ఆక్రమించిన కబ్జాదారులు రెవెన్యూ అధికారుల హెచ్చరికను పట్టించు కోకుండా సూచిక బోర్డును తొలగించారని, ఈ విషయాన్ని గ్రహించిన సిపిఎం నాయకులు ఈ దౌర్జన్యానికి పాల్పడిన కబ్జాదారులపై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకో వాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నల్లయ్యకు ఫిర్యాదు చేశారు. స్పందించి తహశీల్దారుతో చర్చించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఆరు నెలల జీతాలు ఇప్పించండి

సామాజిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర శానిటేషన్ వర్కర్స్ డిమాండ్

ప్రజాశక్తి - సత్యవేడు: తమకు ఆరు నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సత్యవేడు సామాజిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం శానిటేషన్ వర్కర్స్ మెడికల్ ఆఫీసర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. తిరుపతి సిఐటియు వైస్ ప్రసిడెంట్ మిలుగు రమేష్ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ సురేష్‌కి తమ ఆరు నెలల బకాయి జీతాలను ఇప్పించాలని కోరుతూ వినతి పత్రాన్ని .ప్రతి నెల తమ జీతాలు,పిఎఫ్,ఈఎస్‌ఐ సక్రమంగా తమ ఖాతాలకు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని విన్నవించుకున్నారు. భద్రతా పరికరాలు శానిటేషన్ సామగ్రి సకాలంలో అందించాలని కోరారు. ఆ మేరకు శానిటేషన్ వర్కర్స్ సమస్యలు పరిష్కరిస్తామని మెడికల్ ఆఫీసర్ సురేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు మురళి , శానిటేషన్ కార్మికులు నేతా,(ప్రభావతి,శివ, దేవ నాయికి, కౌసల్య,శాంతి, మరియమ్మ, చిలకమ్మా,బీల, కర్పగం పాల్గొన్నారు.

తహశీల్దారుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండల తహశీల్దారు వెంకటేశ్వరును టిడిపి నాయకులు, టిఎన్‌టియుసి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు రావిళ్ల మాధవ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు డి రవికుమార్, ఐటి డి పి కోఆర్డినేటర్ యం ఈశ్వర్ యాదవ్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్,19వ వార్డు అధ్యక్షులు కే ఉమా శంకర్ రెడ్డి, ఘనంగా పూలమాలవేసి శాలువాతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ విషయం లో ఏదైనా సమస్యలు మా దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తామని ఆయన తెలి పారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు కృష్ణమరాజు, మురళి, చిరంజీవి పాల్గొన్నారు.

తహశీల్దారును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గూడలి పంచాయతీ పరిధిలోని గూడలి,చంద్రశేఖరపురం గ్రామాలలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ద్వారా ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరంను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామస్థులు భారీగా వచ్చి రక్త పరీక్షలు చేసుకోవడం జరిగింది.పరీక్షలు అనంతరం పలువురు కు మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గూడలి ఉపసర్పంచ్ పల్లెమల్లు విజయసారధి రెడ్డి,పంచాయతీ కార్యదర్శి కిరణ్ లు మాట్లాడుతూ సాధారణ రక్త పరీక్షలు కాకుండా ఇలాంటి అసాధారణ క్యాన్సర్ నిర్ధారణ రక్త పరీక్షలు నిర్వహించడం సంతోషకర మన్నారు. ఈ కార్యక్రమంలో వి ఓ పి ఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య, స్విమ్స్ ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్యపరీక్షల్లో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది..

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిల సాయిబుల పల్లె గ్రామ సమాఖ్య సమావేశంలో, రంగన్నగారి గడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ కుష్టు, సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పొడలు లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు, తదితరులు వుంటే వ్యాధి నిర్ధారణ కోసం దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల్ని సంప్రదించాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ఖరీదైన మందులు, శస్త్ర చికిత్సలు ఎంసీఆర్ చెప్పులు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. దోమల నివారణ కు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సౌజన్య, సంఘసభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల 73వ వ్యవస్థాపక దినోత్సవం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి నారాయణమ్మ అధ్యక్షతన కళాశాల ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అధ్యాపకులకు, విద్యార్థులందరికీ 73వ కళాశాల వ్యవస్థాపన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 1952 సంవత్సరం ఆగస్టు 11వ తేదీన శ్రీ పద్మావతి మహిళా కళాశాలను స్థాపించారన్నారు. ఈ కళాశాల నాటి నుంచి నేటి వరకు ఎలాంటి లోపం లేకుండా క్రమశిక్షణను కలిగి అభివృద్ధి పథంలో నడుస్తోంద న్నా రు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌ఛార్జి బి.జ్యోతి, విశ్రాంత ప్రిన్సిపల్ కె.మహ దేవమ్మ, వార్డెన్ హేమలత, భద్రమణి, విద్యుల్లత, ఉమారాణి, భువనేశ్వ రి, కృష్ణవేణి, వసుధ, శిరీష, ఉమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్గొన్న శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల బోధన సిబ్బంది

అసత్య ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

చెవిరెడ్డికి టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు సవాల్

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరిలో భూకబ్జాలకు పాల్పడుతున్నానని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని దమ్ము, ధైర్యం ఉంటే నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసు కుంటానని టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు సవాల్ విసిరారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో ఓ న్యూస్ ఛానల్ డిబేట్‌లో చెవిరెడ్డి పేర్కొన్నట్లు అవినీతి ఆరోపణలు చేసి తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, అసత్య ఆరోపణలు చేయడం, ఆర్థిక మూలలపై దెబ్బ కొట్టడం, వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి నైజమని పేర్కొన్నారు. సొంత పత్రిక వుందని పదే పదే అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూ కబ్జాకు పాల్పడినట్లు ఆరోపించడం కాదు.. వాస్తవాలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని తెలిపారు. 10 ఏళ్ల క్రితం ఓ బైక్ పై తిరిగే చెవిరెడ్డికి 5 వేల కోట్లకు పైగా ఆస్తులు ఎలా వచ్చాయి?' అని ప్రశ్నించారు. టిటిడి పేరు పెట్టి దాతల నుంచి తుమ్మలగుంట ఆలయానికి తెచ్చిన నిధులు ఎంత ? కోట్ల రూపాయల మఠం భూములు కబ్జా చేసింది ఎవరు? రూ.150 కోట్లు తుడా నిధులతో తుమ్మలగుంట చెరువు కబ్జా చేసింది ఎవరు? అని సుబ్రహ్మణ్యం నాయుడు ప్రశ్నించారు. చెవిరెడ్డి అవినీతిపై సత్య ప్రమాణానికి తాను సిద్ధం అని సవాల్ విసిరారు. తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న పత్రికపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. చెవిరెడ్డి అవినీతి చిట్టా మొత్తం త్వరలో బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సక్కూరి ధనుంజయ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, ఏజీ పల్లి బాల, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు

క్రైం న్యూస్

దొంగతనం కేసులో బాల నేరస్థుడికి ఏడాది జైలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో జువైనల్ జస్టిస్ బోర్డు తిరుపతి వారు బాల నేరస్తుడికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసులో నేరం రుజువై చిత్తూరుకు చెందిన బాలుడిని జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం దోషిగా నిర్ధారించారు. దీంతో ఆ బాలుడికి సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధిస్తూ, జువెనైల్ జస్టిస్ బోర్డు తిరుపతి వారు తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి సుబ్బరాయుడు మాట్లాడుతూ నేరస్థులకు శిక్ష పడి నప్పుడే బాధితులకు పూర్తి న్యాయం చేసిన వారు అవుతామని, అప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు సదాభిప్రాయం కలుగుతుందన్నారు. ఈ కేసు దర్యాప్తునకు కృషిచేసిన అధికారులు, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది కోర్టు మానిటరింగ్ సిస్టం సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

కంటైనరును ఢీకొట్టిన స్కూటరు వ్యక్తి మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): కంటైనర్ వెనుక భాగంలో స్కూటర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి సి మల్లవరం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టు ఆర్ తిరుమల (25) అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు ప్రమాద సమాచారాన్ని స్థానికులు చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి నుండి బెంగళూరు వైపు వెళుతున్న కంటైనర్‌ను తిరుపతి రూరల్ మండలం అంబేద్కర్ కాలనీకి చెందిన ఆర్ తిరుమల ద్విచక్ర వాహనంలో (బుల్లెట్) తిరుపతి నుంచి చంద్రగిరి వైపు వేగంగా వచ్చి కంటైనర్ వెనుక భాగాన్ని ఢీ కొట్టాడు. దీంతో స్కూటరిస్టు తిరుమల తారు రోడ్డు పై పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. మృతునికి సంబంధించిన వ్యక్తులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని సీఐ ఎం రామయ్య తెలిపారు.

'అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న'

అన్నదానం నిర్వహిస్తున్న మయూరి శ్యాం యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని శ్రీ కృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. గుడూరు గమళ్ళపాలెంలో మెప్మా సౌజన్యంతో మై ఫ్రెండ్స్ అసోసియేషన్ వసతి గృహంలో మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరి, రమేష్ పాల్గొన్నారు.

తహశీల్దారు భాగ్యలక్ష్మికి సత్కారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి అర్బన్ తహశీల్దారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన భాగ్యలక్ష్మిని ఆర్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రమణ యాదవ్, ఫౌండేషన్ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. తిరుపతి అర్బన్ మండలానికి తొలి మహిళ తహశీల్దారుగా రావడం సంతోషకరంగా ఉందని, తిరుపతి నగరంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని రమణ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలను తహశీల్దారు భాగ్యలక్ష్మి ప్రత్యేకంగా ప్రస్తావించి రమణ యాదవ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడి వెంకీ, తక్కాలి వెంకటేశ్వర్లు, చిరంజీవి యాదవ్, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్: గ్రామాల్లో సమస్యలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సంపూర్ణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదట ఆయన ఆయా శాఖల అధికారులతో వారి విధి విధానాలపై చర్చించారు. గ్రామాల్లో నివసించే ఏ ఒక్కరికి ఎటువంటి కష్టం వాటిల్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులు నాయకులపై వుందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వెంకట సుబ్బారెడ్డి, తహశీల్దారు డి. లక్ష్మీనారాయణ, ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ రవీందర్ నాథ్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

శేష వాహనంపై ద్రౌపది దేవి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలో వెలసిన ద్రౌపది సమేత ధర్మరాజు స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవా రం అమ్మవారు శేష వాహనంపై ఊరేగించారు. ఉదయం 9 గంటలకు హరిజన సంఘం ఆధ్వర్యం లో ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు హిడింభాసుదర బకాసుర వధ వైభవంగా నిర్వహించారు. రాత్రి 9 గంటలకు అమ్మవారుశేష వాహనంపై మాడ వీధులలో ఊరేగించారు. ఉభయదారులుగా విశ్వనాథపల్లి కుమారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, ఆలయ నిర్వాహకులు, కమిటీ ఛైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

టిటిడికి రూ.4.10 లక్షల ఎరువుల విరాళం

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో: టీటీడీ ఉద్యానవన విభాగానికి కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వారు రూ.4.10 లక్షల విలువైన ఎరువులను సోమవారం విరాళంగా అందించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రసిడెంట్ సత్యనారాయణ, ఆర్‌ఎం రమణారెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ మురళి ఈ మేరకు ఎరువులను తిరుమలలోని కల్యాణవేదిక వద్ద గల ఉద్యానవన విభాగం కార్యాలయంలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులుకు అందించారు.

డ్రగ్స్ రహిత భారతదేశాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని టి.ఎం.వి కండ్రిగ పంచాయతీలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు హేమశ్రీ, బాలమురళి ఆధ్వర్యంలో 'డ్రగ్స్ రహిత భారతదేశాన్ని నిర్మిద్దాం..' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. మొదట మాదకద్రవ్యాలను నివారించాలంటూ గ్రామంలో ర్యాలీతో పాటు అవగాహన నిర్వహించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలను నివారించాలంటూ గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వకుళామాతను దర్శించుకున్న మంత్రులు

ప్రజాశక్తి -రామచంద్రపురం: మండలంలోని పాతకాల్వ గ్రామ సమీపంలో ఉన్న వకుళా మాత అమ్మవారిని సోమవారం రాష్ట్ర మంత్రులు అనగాని సత్య ప్రసాద్, గొట్టి పాటి రవికుమార్ దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయానికి విచ్చేసిన మంత్రులకు స్థానిక టిడిపి నాయకులు శివారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మంత్రులకు టిటిడి అధికారులు దర్శన ఏర్పాటు చేసి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. టిడిపి నాయకులు రాష్ట్ర మంత్రులను దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అమ్మవారి చిత్రపటాలను అందించారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, రోస్ రెడ్డి, ప్రభు రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, వి మునిశేఖర్, రమేష్, భాస్కర్ బాబు పాల్గొన్నారు.

నిత్యాన్నప్రసాదం ట్రస్ట్‌కి రూ.51లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: హైదరాబాద్‌లోని పునర్జన్ ఆయుర్వేద ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బొమ్ము వెంకటేశ్వర రెడ్డి సోమవారం సాయంత్రం టిటిడి ఎస్‌వి.అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.51,09,116లు విరాళంగా అందించారు. తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో అదనపు ఈ ఓ సిహెచ్ వెంకయ్య చౌదరికి దాత విరాళం చెక్కును అందించారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించండి

- జిల్లా పంచాయతీ అబ్జర్వర్ కె రాజ్యలక్ష్మి

మాట్లాడుతున్న జిల్లా పంచాతీ అబ్జర్వర్ కె రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి -కోట : మండలంలోని అన్ని పంచాయ తీల అభివృద్ధిపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కాన్ఫరెన్స్ హాలులో మండల పంచాయతీ సర్పం చులకు, కార్యదర్శులకు సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయ తీ అబ్జర్వర్ మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్యం, గ్రామాభివృద్ధి పనులు, వివిధ రకాల కార్యక్రమా లపై పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రభుత్వ నిధులనుసకాలంలో సద్వినియోగం చేసుకోవాలని, విద్యుత్ బిల్లులపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పివో వెంకట రమణ, ఏవో, ఇఒపిఆర్‌డి శ్రీనివాసులు, గూడలి పంచాయతీ సెక్రటరీ కిరణ్, తదితర పంచాయతీ సెక్రటరీలు, పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గ్రామాల్లో మౌలిక సదుపాయాలు , పారిశుధ్యం పై సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం గూడూరు ఎంపిడివో కార్యాలయంలో గ్రామ సర్పంచ్ లకు, కార్యదర్శులకు శిక్షణా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్పంచులు గ్రామ పంచాయతీల అభివృద్ధి నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ అభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉంటే పంచాయతీ అభివృద్ధికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర రావు, డిఎల్‌పివో వెంకట రమణ , ఏవో మురళీకృష్ణ, ఎంపిపి గురవయ్య, గ్రామ సర్పంచ్ లు , పాల్గొన్నారు.

దొరవారిసత్రం : గ్రామ పంచాయతీలు అభివృద్ధికి ఆదర్శంగా, అవసరమైన మౌలిక వసతులు కల్పనకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివరాజు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో 15 ఫైనాన్స్ కింద నిధులు మంజూరు, 2024 –2025 యాక్షన్ ప్లాన్ గురించి చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రమేష్, వైస్ ఎంపిపి దువ్వూరు గోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రతి పంచాయతీలోనూ ఆర్థిక వనరులు సమకూర్చుకోవడం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో త్రివిక్రమరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, సెక్రటరీలకు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో త్రివిక్రమ రావు మాట్లాడుతూ నెలకు ఒకసారి పంచాయతీ , లేదంటే కనీసం 90 రోజుల్లో పాలక మండలి సమావేశం నిర్వహించాలన్నారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేసే బాధ్యత ఆయా పంచాయతీ కార్యదర్శులపై వుందన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పంచాయతీ సెక్రటరీ ఇందిరా శివకుమార్, పలువురు సర్పంచులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏ మునివేలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో బి ఇందిరమ్మ, ఇవోపిఆర్‌డి శ్రీనివాసులు, రిసోర్స్ పర్సన్ నరసింహ మొదలు లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తడ: తడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తడ మండల అభివృద్ధి అధికారి కొంప రమేష్ రెడ్డి, ఎంపీడీఓ యస్ విజయ కుమార్, వైస్ ఎంపిపి కె వెంకటేష్ పాల్గొన్నారు. మండల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పుత్తూరులో



తడలో